
# వనితావని




“పాపా ఈ కాఫీగ్లాసు కాస్త పని మనిషికి వేసిరా అమ్మా-కాస్త మంచి నీళ్ళు, దువ్వెన తెచ్చిపెట్టు” అంటూ ఏడేళ్ళ పాపకి ఒకటికి రెండు పనులు చెబితే అది-“నేనేం పనిమనిషినా, అన్ని పనులూ నాకే చెబుతావు?” అని విసుక్కుంటుంది. ఇల్లా కసరడం వాళ్ళమ్మ దగ్గర నేర్చుకుంది అది. ఎందుకంటే వాళ్ళమ్మ-నాలుగు వందల రూపాయల ఉద్యోగస్తురాలు. వీలున్నప్పుడల్లా “నేనేం వంటమనిషినా అందరికీ వండి వార్చడానికి” అని విసుక్కుంటుంది.

# ద్విపాత్రాభినయం

## తురగా జానకీరాణి




“జుట్టు రిబ్బనుకి కట్టుకుని విసిగింది, కాస్త నెమ్మదిగా కట్టిపెడతావా?” అని ఆయనగారడిగితే “నేనేం టైలరుని కానండీ...” అంటుంది. పిల్లలకి ప్రొద్దుపోయేందుకు పాటాలు చెప్పమంటే “నేనేం ట్యూషను మాష్టర్నా?” అంటుంది. అవసరమైతే కాఫీ గ్లాసులు కడగడానికి ఆమె అంట్లు తోమే అమ్మి రాదు. పిల్లలవీ, ఆయనగారివీ




బట్టలుతకడానికి ఆమేం చాకలి కాదు. మరి ఆవిడ ఎవరయ్యా అంటే—కాలుమీద కాలు వేసుకుని కుర్చీలో కూర్చుని, రోజంతా "చకీ చెడీ" పనిచేసే ఉద్యోగస్తురాలు. పోనీ అల్లాగని "నీ చేతిలో డబ్బుందిగా, బియ్యమూ అవీ ఇంట్లోకి పట్టుకు రాకపోయినావా?" అంటే, "నేనేం మగాణ్ణా అన్ని పనులూ చేయడానికి, ఉన్నాడుగా భరించే ఆయన భర్త" అనేస్తుంది.

వెయ్యిన్నర నుంచి, అరవంద వరకు రూపాయలు రకరకాల ఉద్యోగాలు చేసి సంపాదించే ఆడవాళ్ళ జాతి ఒకటి గత పదిపదిహేను సంవత్సరాల్లో దేశంలో పెరిగిపోయింది. డాక్టర్లుగా, నర్సులుగా, ఆఫీసర్లుగా, గుమాస్తాలుగా, టీచర్లుగా— వీళ్ళంతా ఉద్యోగాలు చేస్తూ, రోజులో చాలా భాగం యిల్లు వదిలేసి వుంటున్నారు. అయినా ఏ కొద్ది మందో తప్ప చాల వరకు యింట్లో ఇల్లాలిగా, తల్లిగా సంసారం ఈదవలసిన వాళ్ళే. వంటకీ, పనికీ, పిల్లలకీ వేరు వేరుగా మనుషులని పెట్టి చేయించుకునే సత్తా వున్నవాళ్ళు కొందరైతే అత్తనో, అమ్మనో మారుమూల బంధువునో చేరదీసి ముప్పు గడుపుకుంటున్నవాళ్ళే ఎక్కువ మంది. ఐనప్పటికీ ప్రొద్దున్నుంచి, రాత్రి వరకూ ఆమెకి గడియారంతో పందెం తప్పదు.

ఈ వేగానికి తట్టుకోలేక, వంట్లో అప్పుడప్పుడు కలిగే అనారోగ్యానికి అవసరమైన వైద్యం, విశ్రాంతి సమకూర్చుకోలేక చికాకు పడుతుంటుంది ఉద్యోగం చేసే ఇల్లాలు. ఆ చిరాకు తాటాకు మంటగా వుంటే ఫరవాలేదు. నెగడు చందం అయితేనే కష్టం. అన్నం, పప్పు వండి వంట యింపనిపించి, తింటే తినండి, పోతే పోండి అనే పద్ధతిలో వంటిల్లు వదిలేసి, అరగంటసేపు అద్దంముందు కూర్చుని అలంకరించుకుని ఉద్యోగాలకి వెళ్ళే మనుష్యులు కొందరున్నారు. నాలుగు రుచులూ కోరే నాలుకతో, సుష్టుగా భోంచేయాలనే కోరికతో వుండే ఆమె భర్తా, ఏవేవో తినాలని తల్లడిల్లిపోయే పిల్లలూ అమ్మకి తీరుబాటు ఎప్పుడు అవుతుందా అని ఆశగా చూస్తుంటారు. ఆదివారమో, పండుగో రావాలని అనుకుంటూ, పొరుగిళ్ళలో ఏదైనా ఎవరేనా పెడితే అవురుమంటూ తింటారు.

భర్త రాత్రి సినిమాకి వెళ్ళి వచ్చేసరికి, మూతలు లేని గిన్నెలు, ఎంగిలి పళ్ళెలు, ఇనుప బాణలి అడుగున మాడిన నాలుగు కూరముక్కలు మిగిల్చిన భోజ్యేషుమాతలున్నారు. రాత్రిపూట పిల్లకిపాలు నేనే ఎందుకు పట్టాలి అని పంతానికి పోయి, మొగ పురుషునిచేతే ఆ పని చేయించే




కన్నతల్లులున్నారు, 'అన్నం పెట్టవే అమ్మా!' అని చిన్నగా, దీనంగా అడిగే పిల్లల్ని, 'ఛో పెట్టుకుని తినలేవూ?' అని కసిరే అన్నపూర్ణలూ వున్నారు. సందో, శ్రద్ధో పీక్కు తిని ఓ రూపాయి పారేసి పత్రికా పఠనంలో పడిపోయే విద్యావతులూ వున్నారు.

ఇంట్లో వూపిరాడని పని లేకపోయినా కూడా వళ్ళు కాపాడుకోవాలన్న కోరికా, నిద్రాదేవి కౌగిలింతలో ఒదిగిపోవాలన్న సుషుప్తిప్రయత్నం వున్న స్త్రీ ఉద్యోగం చేస్తోంటే, ఆమెకి సంసారం బాధ్యత ఒక పెద్ద కొండంత బరువుగా కనిపిస్తుంది. ఆమె తనకి ఆకలి వుంటేనే తిండికోసం ఆరాట పడుతుంది. తనకి జిహ్వ వే కావాలనుకున్న వండుతుంది. తనకి అవసరమనిపించినత వరకే వంటగదిలో మకాం, మిగతా సమయాల్లో భర్త అయేనీ, పుట్టుకయేనీ కన్న బిడ్డ అయేనీ'తినడానికి ఏమైనా వుందా? అని అడగడానికి వీల్లేదు. మంచి జీర్ణశక్తి వున్న భర్తకీ, ఎదిగే పిల్లలకీ కరకరలాడే ఆకలి వుంటుందని, ఏదీ దొరక్క మరమరాలో, పెసరపప్పో బొక్కుతుంటారనీ వూహించలేని మనిషి ఆమె ఊహించినా కూడా తనకి వంటలూ, పిండి వంటలూ చేయడానికి ఓపిక ఎక్కడుంది? పోనీ చేయించడానికి మాత్రం ఎంత శ్రమ పడాలి? అప్పుడు తనకి రెస్టు ఎప్పుడుంటుంది? మరో మెట్టు పైకి ఎక్కినవాళ్ళు—

"అన్నీ అక్కడే వున్నాయి - కావలసినవాళ్ళు యిల్లు ఖరాబు చేయకుండా వండుకోండి. అందరికీ వండడానికి నేనేం వంట గత్తెను కాను. నేను చేయలేను, చేయను, పైన మీ యిష్టం" అని ఖచ్చితంగా చెప్పేసేవాళ్ళూ వున్నారు. వారి సిద్ధాంతం "మరొకరికోసం నేనెందుకు కష్టపడాలి?" అన్నది.

ఏమిటండీ, మరీ అంత విడ్డూరంగా చెబుతారు. ఎంత ఉద్యోగస్తురాలైనా కట్టుకున్న మొగుడికీ, తను కన్న పిల్లలకీ అన్నం పెట్టదా అంటారేమో. పెట్టరండీ! సంసారంలో హక్కులు, పనులు పంచుకోవటం, ఎన్ని గంటలు ఎవరికి రెస్టు చిక్కుతోందిలాంటి ప్రశ్నలు లేవదీసి క్రొత్త సిద్ధాంతాలు రూపొందిస్తున్నారు. నిజంగా ఓపికలేని నీరస ప్రాణాలను గురించి, తోటకూర కాడల్లా వాలిపోయే అబలల సంగతి కాదు మనం అనుకునేది. వారెప్పుడూ క్షంతవ్యులే.

భగవంతుడిచ్చిన స్వంత చేతులతో తనవారికి (తను వండకపోయినా, వండించి) అందంగా అమిర్చి పెట్టుకుంటే ఎంత బాగుంటుంది! ఆ భగవంతు డిచ్చిన సహజమైన స్త్రీ హృదయం నుండి చల్లని హిమబిందువులు జాలువారుతాయి ఆ క్షణంలో. అన్నంకోసం ఎవరూ పుట్టలేదు. కానీ పుట్టిన వారికి ఆకలి వుంటుందనీ ఆదరించి కడుపునిండా పెట్టడమే పెళ్ళి చేసుకుని, సంసారం యీదే ఆడ మనిషికి సబబు అనీ తెలుసుకుంటే - ఆమెను కట్టుకున్నవాని జీవితం అంత దుర్భరం కాదు. కన్న బిడ్డలకి అమ్మ, "అమ్మ"గా కనబడుతుంది - డబ్బు సంపాదించే మరమనిషిలా కాకుండా. ★


ఏజెంట్లు : (1) సిటీఫార్మా డిస్ట్రిబ్యూటర్స్, భావనారాయణ వీధి, విజయవాడ-1, (ఆ.ప్ర.) (2) ఫార్మా ట్రేడర్స్, (హైదరాబాద్), కందస్వామి రోడ్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్ (ఆం. ప్ర.)